

దరువు ఎల్లన్నను బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించి మాట్లాడుతున్న వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్



కార్యక్రమానికి హాజరైన కార్యకర్తలు, పార్టీ శ్రేణులు



రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మానకొండూర్ నియోజకర్గ ప్రజాప్రతినిధులు, నాయకులతో దరువు ఎల్లన్న

## బీఆర్ఎస్‌లోకి
# దరువు ఎల్లన్న

- గులాబీ కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 30 (నమస్తే తెలంగాణ): ఓయూ విద్యార్థి, తెలంగాణ ఉద్యమ నాయకుడు దరువు ఎల్లన్న సోమవారం తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా అమాత్యుడు రామన్న ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎల్లన్నకు పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.



బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు మద్దతుగా ఓటు అభ్యర్థిస్తున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్



బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావు ప్రచార సభకు హాజరైన ప్రజలు, మహిళలు

# కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రంలో చీకటే

- ప్రజలందరూ టార్చ్‌లైట్లు కొనుక్కోవాల్సిందే
- కేసీఆర్ హయాంలోనే ఆదర్శంగా తెలంగాణ
- బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడను ఆశీర్వదించండి
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్
- రుద్రంగిలో చల్మెడతో కలిసి ప్రచారం



మాట్లాడుతున్న రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినిపల్లి వినోద్‌కుమార్, పక్కన బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు

రుద్రంగి, అక్టోబర్ 30: 'కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం చీకటిమయమే అవుతుంది. ప్రజలందరూ టార్చ్‌లైట్లు కొనుక్కోవాల్సి వస్తుంది. ఈ తొమ్మిదిన్నర ఏండ్లల్లో ఎన్నో పనులు చేసినం. మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తం' అని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. సోమవారం ఆయన రుద్రంగిలో నిర్వహించిన ఇంటింటికీ గులాబీ జెండా కార్యక్రమానికి హాజరయ్యారు. మండల ప్రజాప్రతినిధులు, కులసంఘాల నాయకులు, మహిళలు మంగళహారతులు, బతుకమ్మలు, బోనాలు, డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుతో కలిసి ఇంటింటా ప్రచారం చేశారు. అనంతరం వినోద్‌కుమార్ మాట్లాడుతూ, కాంగ్రెస్ కొన్నేండ్లపాటు దేశాన్ని, రాష్ట్రాన్ని పాలించి చేసిందేమీలేదదన్నారు. ఇప్పుడు స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ అమలు చేస్తున్న పథకాలు చూసి కండ్లు మండించుకుంటుందన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం మళ్లీ అంధకారం అవుతుందన్నారు. రాష్ట్రం ఏర్పాటుకాక ముందు రైతు అత్మహత్యలు ఉండేవని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయంలో హైదరాబాద్‌లో మతఘర్షణలు ఉండేవని, ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొన్నదన్నారు. పదేండ్లుగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేసి రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిందన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే మరోసారి కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు కారు గుర్తుకు ఓటేసి ఆశీర్వదించాలని కోరారు. కళాకారుల సంఘం సభ్యులు, రజక సంఘం సభ్యులు, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు బీఆర్ఎస్ అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహారావుకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్‌రెడ్డి, ఎంపీపీ గంగం స్వరూపారాణి, జడ్పీటీసీ గట్ల మీనయ్య, సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఏఎంసీ చెర్మన్ ఏనుగుల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కిషన్‌రావు, ఎంపీటీసీ మంచె లావణ్య, జమీలాబేగం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దేగావత్ తిరుపతి, గ్రామశాఖ అధ్యక్షుడు దయ్యాల కమలాకర్, ఏఎంసీ వైస్ చెర్మన్ కంటె రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

ప్రజలందరూ నన్ను ఆశీర్వదించి గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తా. ప్రచారంలో ఎక్కడికి వెళ్లిన ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తున్నది. మీ ఆదరణ, అభిమానం చూస్తే తప్పకుండా విజయం సాధిస్తామనే నమ్మకం కులుగుతున్నది. ఈ తొమ్మిదేండ్లలోనే రుద్రంగి మండలంలో రూ.109కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలు చేపట్టినం. రాబోయే రోజుల్లో దవాఖాన, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు, డ్రైనేజీ వంటి మిగతా అన్ని సమస్యలు పరిష్కరిస్తాం. ప్రతిపక్షాలను నమ్మి మోసపోవద్దు. అభివృద్ధి చేసే లక్ష్యంతో ముందుకువస్తున్న తనకు ఒక అవకాశం ఇవ్వండి. ఏడాదిలోపు సమస్యలన్నీ పరిష్కరిస్తా.

*- చల్మెడ లక్ష్మీనరసింహారావు,*
*వేములవాడ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి*



బతుకమ్మలతో ఊరేగింపుగా వస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీ నరసింహరావు, జడ్పీ చైర్‌పర్సన్, ఎంపీపీ, జడ్పీటీసీ, సెస్ డైరెక్టర్, నాయకులు

# కేసీఆర్‌తోనే అభివృద్ధి

- కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవద్దు
- మోసపూరిత హామీలతో ఆగం కావొద్దు
- మరోసారి నన్ను ఆశీర్వదించండి
- బీఆర్ఎస్ మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్
- పారువెల్ల ఆలయంలో ముడుపు కట్టి ప్రచారం ప్రారంభం



పారువెల్లలోని లక్ష్మీగణపతి ఆలయంలో ముడుపు కడుతున్న బీఆర్ఎస్ మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

గన్నేరువరం, అక్టోబర్ 30: కాంగ్రెస్ మాయమాటను నమ్మి మోసపోవద్దని, మోసపూరిత హామీలతో ఆగం కావొద్దని.. సీఎం కేసీఆర్‌తోనే అభివృద్ధి సాధ్యమని మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. తనను మరోసారి అఖండ మెజార్టీతో ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. గన్నేరువరం మండలం పారువెల్ల గ్రామంలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, ముడుపుకట్టి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. అనంతరం మండలంలోని యస్వాడ, గోపాల్‌పూర్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రసమయి బాలకిషన్ మాట్లాడుతూ, 'ప్రజలు.. సారూ.. కారూ.. కేసీఆర్ సర్కారు' అనే నినాదంతోనే ముందుకెళ్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ నాయకుల మాటలకే గ్యారెంటీ లేదని, ఇక ఆరు గ్యారంటీలకు గ్యారంటీ ఏమిటని ప్రశ్నించారు. కరోనా సమయంలో ఆ పార్టీ నాయకుడు కవ్వంపల్లి ఎక్కడున్నాడు? ఆయనకు అప్పుడు నియోజకవర్గ ప్రజలు గుర్తు రాలేదా..? అని ప్రశ్నించారు. కవ్వంపల్లికి ప్రజలపై ప్రేమ ఉంటే ఎందుకు ఉచితంగా వైద్యం చేయలేదని నిలదీశారు. ఎన్నికలు వస్తేనే ఆయన ఊర్లలోకి వచ్చి దొంగ మాటలు చెబుతాడని, వాటిని నమ్మి ఆగం కావొద్దని ప్రజలకు సూచించారు. బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలోని అంశాలను వివరించారు. ప్రతి దళిత కుటుంబానికి ₹10 లక్షల సాయం చేస్తామన్నారు. కులవృత్తులపై ఆధారపడిన బీసీలకు ₹లక్ష సాయం చేస్తున్నామని గుర్తు చేశారు. పారువెల్ల నుంచి వడ్లూరు గ్రామానికి రోడ్డు, చెరువు మత్తడిపై బ్రిడ్జి నిర్మాణం చేస్తానని హామీ ఇచ్చారు. బెజ్జంకి మండల కేంద్రానికి చెందిన యాదవ, పద్మశాలీ సంఘాల నాయకులు పలువురు, బీఎస్పీ నాయకులు, వీరపూర్ గ్రామానికి బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా, వారికి గులాబీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ప్రచారానికి వచ్చిన రసమయి బాలకిషన్‌కు ఆయా గ్రామాల్లో మహిళలు బతుకమ్మలు, బోనాలతో ఘనస్వాగతం పలికారు. బొట్టుపెట్టి, మంగళహారతులు పట్టారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రవీందర్ రెడ్డి, ఎంపీపీ మల్లారెడ్డి, సర్పంచ్ మోహన్ రెడ్డి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు బద్దం తిరుపతి రెడ్డి, మహేందర్, సురేశ్, రెడ్డి, రాములు తదితరులు పాల్గొన్నారు.